సాక్షి ఒడిశా

సోమవారం ၊ 2 ၊ జూన్ ၊ 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,90,635లు, బంగారం 16 గ్రాముల 400 మిల్లీగ్రాములు, వెండి 39గ్రాముల 300 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



హాఫ్ మారథాన్ విజయవంతం

హాఫ్ మారథాన్ విజవంతమైంది. ఔత్సాహికులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

- 8లో▸



ఊపందుకున్న రథాల పనులు

పర్లాకిమిడిలో రథాల పనులు ఊపందుకున్నాయి. రథయాత్రకు సన్నద్ధం చేస్తున్నారు.

- 8లో▸

పాల ఉత్పాదనలో..

అగ్రస్థానం లక్ష్యం



రాష్ట్ర స్థాయి ప్రపంచ పాల దినోత్సవంలో ముఖ్యమంత్రి ప్రసంగం



పాడి ప్రదర్శన సందర్శనలో ముఖ్యమంత్రి

- రానున్న ఐదేళ్లలో రాష్ట్రంలో పాల ఉత్పత్తి రెట్టింపు
- రాష్ట్ర స్థాయిలో ప్రపంచ పాల దినోత్సవం - 2025

భువనేశ్వర్: 2023-24 సంవత్సరంలో మన రాష్ట్రం 26.4 లక్షల మెట్రిక్ టన్నుల పాలను ఉత్పత్తి చేసిందని, రానున్న ఐదేళ్లలో దాన్ని రెట్టింపు చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, పాల ఉత్పత్తి రాష్ట్రంగా ఒడిశా దేశంలో ఒక నమూనా స్థానాన్ని పొందాలని కోరుకుంటున్నట్లు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తెలిపారు. పాల సంపన్న ఒడిశా, ఆరోగ్యకరమైన ఒడిశా అనే నినాదంతో మనం అంతా కలిసి కట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక అభివృద్ధి శాఖ స్థానిక లోక్ సేవా భవన్ సమావేశ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి ప్రపంచ పాల దినోత్సవం - 2025 కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఈ సందర్భంగా పాడి రైతులకు ముఖ్యమంత్రి వరాల జల్లు కురిపించారు. రాష్ట్రంలోని ఒడిశా పాల సమాఖ్య (ఓంఫెడ్) రైతులకు రూ.1 లక్ష ప్రమాద మరణ సహాయం, ఓంఫెడ్ పాల ఉత్పత్తిదారులకు ప్రభుత్వం లీటరుకు రూ. 3 అదనంగా ఇస్తుందని ప్రకటించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఓంఫెడ్ బాల్టి పెరుగు, ఎ-2 పాలు, ఎ-2 నెయ్యి కొత్త ఉత్పాదనల్ని విడుదల చేశారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి కామధేను యోజన, ఆవు, దూడల పెంపకం, ఆవుల మందల భీమా, గడ్డి సాగు కోసం నగదు ప్రోత్సాహకాల కింద లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందించారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ముఖ్యమంత్రి కామధేను యోజన కింద సుమారు 3 లక్షల మంది గోపాలకులకు రూ. 71 కోట్ల సహాయం అందజేశారు. రాష్ట్రంలోని 77 సమోదిత గోశాలలలో నిస్సహాయ గోవుల నిర్వహణ కోసం సంక్షేమ సంస్థలకు రూ. 10.5 కోట్ల ఆర్థిక సహాయం పంపిణీ చేశారు.

కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా మాట్లాడుతూ పాడి ఉత్పాదన రంగంలో మహిళల స్వావలంబన బలోపేతం అవుతుందన్నారు. మా మిషన్ శక్తి సహకారంతో సేంద్రీయ గత్తం ఉత్పత్తితో మహిళలు లక్ష పతి దీదీలుగా ఎదుగుతున్నారని తెలిపారు. రాష్ట్ర న్యాయ, నిర్మాణం, అబ్కారి శాఖ మంత్రి పృథ్వీ రాజ్ హరిచందన్ తన ప్రసంగంలో ఆవుల పెంపకం మరియు పాల ఉత్పత్తి సమాజంలోని ప్రతి స్థాయిలో ఉపాధిని పెంచడంలో సహాయపడుతుందన్నారు.



లబ్ధిదారులకు ప్రోత్సాహకాలు పంపిణీ చేస్తున్న ముఖ్యమంత్రితో ఇతర మంత్రులు

దేశంలోని ప్రతి గ్రామం స్వావలంబన చెందితేనే దేశ ఆర్థిక వృద్ధి సాధ్యం అవుతుందన్నారు. ముఖ్యమంత్రి కామధేను యోజన పాల ఉత్పత్తి రంగంలో విప్లవం తీసుకొచ్చింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను సుసంపన్నం చేయడానికి, ఒడిశాను పాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధిగా మార్చడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక అభివృద్ధి, సూక్ష్మ, లఘు, మధ్య తరహా పరిశ్రమల విభాగం మంత్రి గోకులానంద్ మల్లిక్ అన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య, పశుసంవర్ధక అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ వశిష్ట, పశు సంవర్ధక మరియు పశు వైద్య శాఖ డైరెక్టర్ విజయ్ అమృత కులంగే, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వివిధ పశు సంక్షేమ సంస్థల కార్మికులు, గోసంరక్షకులు, పశుసంవర్ధక శాఖ కార్మికులు పాల్గొన్నారు.

దోపిడీ కేసులో ఇద్దరు అరెస్టు





అరెస్టయిన దుబసేన్ మాలి, ధనపతి గోండ్

జయపురం: యువకుడిపై మారణాయుధాలతో దాడి చేసి డబ్బు, ఇతర వస్తువులు దోచుకున్న కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేశామని జయపురం సదర్ పోలీసులు ఆదివారం తెలిపారు. అరెస్టయిన వారిలో కొట్‌పాడ్ సమితి లతిగుడ గ్రామానికి చెందిన దుబసేన్ మాలి, సనొపొరియ పంచాయతీ భగుబందర్ గ్రామానికి చెందిన ధనపతి గోండ్ ఉన్నట్లు సదర్ పోలీసు అధికారి సచీంద్ర ప్రధాన్ వెల్లడించారు. అరెస్టయిన ఇద్దరిని కోర్టులో హాజరు పరచగా జడ్జి బెయిల్ నిరాకరించటంతో వారిని రిమాండ్‌కు తరలించామన్నారు. జయపురం సమితి సొలప గ్రామవాసి ఉత్తమ టికాదార్ గత నెల ఏడో తేదీన ద్విచక్ర వాహనంపై జయపురం నుంచి తన గ్రామం సొలపకు వెళ్తుండగా మార్గంలో ధరణహండి అటవీ ప్రాంతంలో నలుగురు దుండగులు అడ్డగించి మారణాయుధాలతో చంపుతామని బెదిరించి అతడి వద్దగల రూ. 10 వేలుతోపాటు మొబైల్ ఫోను లాక్కున్నారు. అంతే కాకుండా అతడి బ్యాంక్ ఖాతాలో ఉన్న మరో 90 వేల రూపాయిలను బలవంతంగా పే ఫోన్ ద్వారా తీసుకొని పరారయ్యారు. దీంతో బాధితుడు ఉత్తమ్ గత నెల ఎనిమిదో తేదీన జయపురం సదర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. లభించిన ఆధారాలతో ధనపతి, దుబసేన్‌లను అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలిస్తున్నట్టు పోలీసు అధికారి సచీంద్ర ప్రధాన్ తెలిపారు. పట్టుబడిన వారినుంచి ఒక బైక్ స్వాధీనం చేసుకున్నామన్నారు. ఏఎస్సై ప్రమోద్ కుమార్ పాణి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రంలో పెరుగుతున్న కోవిడ్ కేసులు

భువనేశ్వర్: రాష్ట్రంలోకి కోవిడ్-19 వైరస్ పునః ప్రవేశంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటీవల కాలంలో కోవిడ్ పాజిటివ్ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. మరో వైపు రాష్ట్రంలో కరోనా మరణం సంభవించినట్లు సమాచారం. దీనిపై సందిగ్ధత నెలకొని ఉంది. రాష్ట్ర ఆరోగ్య శాఖ తాజా సమాచారం ప్రకారం 3 కొత్త కోవిడ్ - 19 పాజిటివ్ కేసులు ఖరారయ్యాయి. వాటితో ఆదివారం నాటికి రాష్ట్రంలో మొత్తం కోవిడ్ కేసుల సంఖ్య 11కి చేరుకుంది. మరింత వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి అవసరమైన కాంటాక్ట్ ట్రేసింగ్, నియంత్రణ చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ హామీ ఇచ్చింది. రాష్ట్రంలో కరోనా పీడితుల సంఖ్యని ఖరారు చేసిన ఆరోగ్య శాఖ ఏ ప్రాంతీయులు అనే అంశాన్ని గోప్యంగా ఉంచుతోంది. ఈ ఏడాది తలెత్తిన కోవిడ్ తాకిడితో ఒక వ్యక్తి మరణించినట్లు సమాచారం. దీనిపై సందిగ్ధత నెలకొని ఉంది. ఈ విషయమై ఆరోగ్య శాఖ ఇప్పటి వరకు స్పష్టమైన సమాచారం జారీ చేయలేదు. ప్రజలు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా ఉండాలని ఆరోగ్య శాఖ కోరింది. కరోనా రోగ లక్షణాలు కనిపించిన వెంటనే అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని ఆరోగ్య నిపుణులు ప్రజలను కోరారు. అధికారులు పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తూనే ఉన్నారు. సంక్రమణ రేటు పెరిగితే అధిక ప్రమాదం ఉన్న ప్రాంతాలలో ముందు జాగ్రత్త చర్యలను తిరిగి ప్రవేశపెట్టే అవకాశాన్ని తోసిపుచ్చలేదు. కరోనా నిర్వహణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి మార్గదర్శకాలను జారీ చేయలేదని ఆరోగ్య శాఖ కార్యదర్శి తెలియజేశారు. అయితే, ఒడిశా ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆస్పత్రుల్లో ఆక్సిజన్ ప్లాంట్లు, పరీక్షా కిట్ల సేకరణ, పడకల ఏర్పాటుతో సన్నాహాలను ప్రారంభించింది.

278 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మ సమితి కాత్రగడ ప్రాథమిక విద్యాలయ ప్రాంగణంలో శనివారం మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా దంత చికిత్స సంస్థ ఐడీఏ హిల్ సిటీ శాఖ తరఫున ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ముఖ్య అతిథిగా జయపురం శాసనసభ్యుడు తారాప్రసాద్ బాహిణీపతి పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యం మహా భాగ్యమన్నారు. అందువలన ప్రజలు ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పొగాకు ఉత్పత్తులు సేవించటం వలన వ్యాధులకు కారణం అవుతాయన్నారు. ముఖ్యంగా క్యాన్సర్, గుండె జబ్బులు బారినపడే ప్రమాదం ఉన్నందున ప్రజలు వాటి వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. శిబిరంలో 278 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఐడీఏ హిల్ సిటీ శాఖ అధ్యక్షులు డాక్టర్ అశోక్ కుమార్ దాస్ అధ్యక్షతన జరిగిన శిబిరంలో కోశాధ్యక్షులు డాక్టర్ సిద్ధాంత నాయిక్, డాక్టర్ సురభి మహంతి, డాక్టర్ దీపనిత సర్కార్, డాక్టర్ పూజ సర్కార్, డాక్టర్ సుతీక్ష్మిత మహాపాత్రో, డాక్టర్ ఫౌజియ తనబీర్, డాక్టర్ పి.సుచేత, డాక్టర్ బెహర, డాక్టర్ ఆర్.కె.బెవురియ, డాక్టర్ ప్రత్యూష్ నంద, డాక్టర్ అమిత్ దాస్, డాక్టర్ దేవార్జున్ రోగులను పరీక్షించారు. శిబిరంలో కొరాపుట్ జిల్లా మాజీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ అరుణ కుమార్ పాఢీ, బొరిగుమ్మ ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ దిలీప్ కుమార్ నాథ్, కాత్రగడ ప్రాథమిక వైద్య కేంద్ర డాక్టర్ శివ ప్రసాద్ మహారాణి పర్యవేక్షించారు.

సతొబిసిలో ఏనుగుల బీభత్సం



ఇంటిలో పడి ఉన్న బియ్యం బస్తాలు



ఇంటి బయట ఏనుగులు చెల్లాచెదురు చేసిన బియ్యం బస్తాలు

రాయగడ: నియమగిరి పర్వత ప్రాంతాల్లో ఏనుగులు బీభత్సం సృష్టిస్తున్నాయి. శనివారం అర్ధరాత్రి గ్రామంలో చొరబడిన ఏనుగుల గుంపు ఇళ్లలో ప్రవేశించి సామగ్రిని ధ్వంసం చేస్తున్నాయి. గ్రామంలో గల గొపినాథ్ జకసిక ఇంటిలో చొరబడిన ఏనుగులు అతను నిల్వ ఉంచుకున్న చోడి, ధాన్యం బస్తాలను బయటకు తీసుకువెళ్లి ధ్వంసం చేశాయి. గత కొద్ది రోజులుగా ఏనుగులు ఈ ప్రాంతంలో సంచరిస్తున్న సంగతి అటవీ శాఖ అధికారులకు తెలిసినప్పటికీ ఇంత వరకు వాటిని తోలే ప్రయత్నం చేయకపోవడంతో అవి గ్రామాల్లోకి చొరబడి బీభత్సాన్ని సృష్టిస్తున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని వాటిని తరమాలని కోరుతున్నారు.


జొరిపంగలో మలేరియా విజృంభణ



మలేరియాతో చికిత్స పొందుతున్న గ్రామస్తులు

రాయగడ: జిల్లాలోని పద్మపూర్ సమితి తొంబాగుడ పంచాయతీలోని జొరిపంగ గ్రామంలో మలేరియా విజృంభిస్తోంది. వ్యాధి బారిన పడిన వారు కళ్యాణసింగుపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్నారు. కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడిన వారి రక్తనమూనాలను సేకరించి పరీక్షించగా మలేరియా సోకినట్లు తేలింది. ప్రస్తుతం ఈ గ్రామంలో శాంతి నాగ్ (55), సుభాష్ మాఝి (54), సస్మిత మాఝి (27), సురియా మాఝి (60), నిలు మాఝి (20), ప్రేమీ మాఝి (10), దీనబంధు మాఝి (48), శాంతి మాఝి (40), సూర్య మాఝి (25), శివాని మాఝి (25), రుంబా మాఝి(30), రామీ మాఝి, రస్మీ మాఝి, దిలసన్ మాఝి, సునీల్ మాఝి, మదంతి మాఝి, జగిలొ మాఝి, రొహిద్ మాఝి, శకుంతల మాఝి, సంతోష్ మాఝిలు ఈ వ్యాధి బారిన పడి చికిత్స పొందుతున్నారు. మలేరియా విజృంభణ సమాచారం తెలుసుకున్న వైద్యులు పద్మపూర్ మెడికల్ అధికారి డాక్టర్ రుతుపూర్ణ పట్నాయక్ నేతృత్వంలో ఒక బృందం ఆదివారం జొరిపంగ గ్రామంలో పర్యటించింది. అక్కడి పరిస్థితిని అధ్యయనం చేసిన బృందం అనారోగ్యంతో ఉన్న కొందరి రక్తనమూనాలను సేకరించింది. అనంతరం వారికి మందులను పంపిణీ చేసింది. అయితే పరిస్థితి అదుపులో ఉందని వైద్య బృందం తెలిపింది. సేకరించిన రక్త నమూనాలను జిల్లా కేంద్రాస్పత్రికి తరలించి పరీక్షలు చేసిన అనంతరం మెరుగైన చికిత్సను అందిస్తామని తెలియజేసింది.

పూరీ శ్రీమందిరంపై డ్రోన్



వీడియోలో ప్రసారమైన దృశ్యం

భువనేశ్వర్: పూరీ శ్రీమందిర్ లోపలి ప్రాంగణం, ఆలయ శిఖరం పైన జరుగుతున్న ఆచారాల స్పష్టమైన వైమానిక దృశ్యాలతో వీడియో సోషల్ మీడియాలో ప్రసారమైంది. ఇది డ్రోన్ ద్వారా చిత్రీకరించినట్లు భావిస్తున్నారు. కట్టుదిట్టమైన ఆంక్షలు ఉన్నప్పటికీ, పూరీలోని పవిత్ర జగన్నాథ ఆలయ శిఖరంపై డ్రోన్ సంచారం భద్రతా యంత్రాంగం పని తీరును నిలదీస్తుంది. గత నెల 30న స్టోరీ బై నారు గోపాల్ అనే శీర్షికతో సాంఘిక ప్రసార మాధ్యమ వేదిక ద్వారా వీడియో ప్రసారం అవుతోంది. దీనిలో ఒక ఆలయ సేవకుడు ఆలయం పైభాగంలో సంప్రదాయ పతాక సేవ కోసం సన్నద్ధం అవుతున్న దశలో నమస్కార భంగిమలో స్పష్టంగా ప్రసారం అవుతుంది. నిత్యం ధ్వజారోహణ సేవని చున్నార్ వర్గం సేవకులు నిర్వహిస్తారు. వివాదాస్పద సాంఘిక మాధ్యమం ప్రసారంతో ఈ వర్గం సేవకుల చిత్త శుద్ధి వైపు వేలెత్తి చూపుతున్నారు. జగన్నాథ సంప్రదాయంలో ధ్వజారోహణ సేవ అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. ఇది దైనందిన ఆచారం. ఈ సేవలో భాగంగా ఆలయ శిఖరాన నీల చక్రం ఆవరణలో పతిత పావన పతాకం కట్టే అపురూప క్షణాల దృశ్యాల్ని ఈ వీడియో ప్రసారం చేస్తుంది. భద్రత, మతపరమైన సున్నితత్వం, అనధికారిక నిఘా ప్రమాదం దృష్ట్యా శ్రీ జగన్నాథ ఆలయంపై డ్రోన్‌ల వాడకంపై నిషేధం ఉన్నప్పటికీ ఆలయ శిఖరంపై సేవల శైలిని బహిరంగంగా చిత్రీకరించి, సామాజిక వేదికలలో ప్రసారం చేయడం పర్యవేక్షణ, అమలులో స్పష్టమైన లోపాన్ని బహిర్గతం చేస్తుంది. రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి పృథ్వీ రాజ్ హరిచందన్ ఈ ఉల్లంఘనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇది డ్రోన్ వాడకం నిషేధం పరిమితుల ఉల్లంఘనగా వ్యాఖ్యానించారు. ఈ ప్రసారంతో అనేక లొసుగులు, భద్రతా లోపాలు వెలుగులోకి వస్తున్నాయని ఆయన అన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి చొరబాట్లను అరికట్టడానికి శ్రీ మందిర్, చుట్టుపక్కల డ్రోన్ నిరోధక సాంకేతికతను ప్రవేశపెట్టడానికి ఇప్పటికే చర్యలు ప్రారంభించామని మంత్రి తెలిపారు. వైరల్ వీడియో పూర్వాపరాలపై ఆరా తీసి డ్రోన్‌ను నిర్వహించడంలో పాల్గొన్న వ్యక్తులను గుర్తించడంలో అనుబంధ అధికారులు నిమగ్నమై ఉన్నట్లు సమాచారం. ఈ సంఘటనపై స్వామి భక్తులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

న్యూస్‌రీల్

బృందావన విహార్‌లో 45 తులాల బంగారం చోరీ

పర్లాకిమిడి: పట్టణంలోని నటరాజ్ సినిమా హాల్ ప్రాంతం బృందావన విహార్‌లో పట్టపగలు ఒక ఇంట్లో చోరీ జరిగి 45 తులాల బంగారం దోచుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నటరాజ్ సినిమా హాల్ బృందావన విహార్ లో మూడంస్తుల భవనంలో స్వర్ణలతా పాల్ తన అన్నదమ్ముడు, తల్లి, భర్తతో నివాసం ఉంటున్నారు. శనివారం ఉదయం 5.30 గంటలకు మందిరానికి తల్లి వెళ్లినపుడు ఫ్యామిలీ అంతా రెండో అంతస్తులో నిద్రిస్తున్నారు. దొంగలు మొదటి అంతస్తులోకి వెళ్లి బీరువాలో ఉన్న 45 తులాల బంగారం వస్తువులు దోచుకున్నట్టు ఆదర్శ పోలీసు స్టేషన్ ఐఐసీ ప్రశాంత భూపతి తెలియజేశారు. యజమాని పార్థరాజ్ పాల్ ఫిర్యాదు మేరకు స్థానిక ఆదర్శ పోలీసు స్టేషన్‌లో పోలీసులు కేసు నమోదు చేశారు. దొంగతనం జరిగిన ఇంటిలో సైంటిఫిక్ టీం వచ్చి దర్యాప్తు ప్రారంభించినట్టు ఐఐసీ ప్రశాంత్ భూపతి తెలియజేశారు.

హత్య కేసులో నిందితునికి యావజ్జీవ కారాగార శిక్ష

రాయగడ: ఒక హత్య కేసుకు సంబంధించి జిల్లా అదనపు జడ్జి అక్షన స్వయి నిందితునికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు మరో రూ.50 వేల జరిమానా విధించారు. జరిమానాను చెల్లించలేకుంటే మరో ఏడాది అదనంగా జైలు శిక్ష అనుభవించాలని తీర్పునిచ్చారు. తన కూతురిని గొంతు కోసి అత్యంత కిరాతకంగా హత్య చేసినట్లు సనొమాటికొన గ్రామానికి చెందిన దుర్యొమాఝి అనే వ్యక్తి ప్రకాష్ ప్రధానిపై టికిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు నిందితుని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ఈ కేసును శనివారం విచారించిన జిల్లా అదనపు జడ్జి ఈ మేరకు తీర్పునిచ్చారు.

విషపూరిత పుట్టగొడుగులు తిని ముగ్గురికి అస్వస్థత



పుట్టగొడుగు తిని అస్వస్థతకు గురైన రామి బెడిసిక, అతని భార్య, కొడుకు

రాయగడ: అడవుల్లో లభించే విషపూరిత పుట్టగొడుగులు వండుకు తిన్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అస్వస్థతకు గురయ్యారు. జిల్లాలోని కల్యాణసింగుపూర్ సమితి శెరిగుమ్మ పంచాయతీలోని తురచి తొరాయి గ్రామంలో ఈ ఘటన శనివారం అర్ధరాత్రి జరిగింది. గ్రామానికి చెందిన రామి బెడిసిక శనివారం మధ్యాహ్నం అడవికి వెళ్లి వంట చెరుకుని తీసుకువస్తున్న సమయంలో దారిలో పుట్టగొడుగు కనిపించింది. దాన్ని సేకరించి రాత్రి ఇంటిలో అంతా వండుకుని తిన్నారు. మధ్యరాత్రి రామి బెడిసిక కు చెందిన మూడేళ్ల కొడుకు దిల్లి బెడిసికకు కడుపు నొప్పి వాంతులయ్యాయి. అనంతరం రామి, అతని భార్య సదారి బెడిసికకు కూడా వాంతులు కావడంతో తీవ్ర అస్వస్థతతకు గురయ్యారు. ఇరుగుపొరుగు వారు వారి పరిస్థితిని చూసి వెంటనే అంబులెన్స్ సాయంతో కల్యాణసింగుపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు వెంటనే వారికి చికిత్స చేయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఆరోగ్యం కుదుట పడటంతో ఆదివారం ఉదయం వారిని గ్రామానికి తరలించారు.

ఉద్యోగ విరమణ రోజే చనిపోయాడు..



భీమ్‌సేన్ ప్రధాన్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మల్కన్‌గిరి: ఉద్యోగ విరమణ చేసిన రోజునే ఓ వ్యక్తి మృతి చెందాడు. మల్కన్‌గిరి మత్తిలి సమితి దలపతిగూఢ గ్రామానికి చెందిన భీమ్‌సేన్ ప్రధాన్ (60) పంచాయతీ పీఈవోగా పని చేశారు. కొన్ని నెలల క్రితం నవరంగ్‌పూర్ జిల్లాకు బదిలీ అయింది. మే 31వ తేదీన ఉద్యోగ విరమణ చేశారు. అయితే అదే రోజు రాత్రి ఆయనకు అకస్మాత్తుగా ఆరోగ్యం బాగోలేక తోటి ఉద్యోగి సమీప ఆరోగ్య కేంద్రానికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆదివారం స్వస్థలం మత్తిలి దళపతిగూఢ గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ప్రధాన్ ఆకస్మిక మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదించారు.

క్లుప్తంగా

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల 'వంటా-వార్పు'



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న ఇంజినీరింగ్ వర్కర్లు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఇంజినీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని, కనీస పెన్షన్ రూ.పది వేలు ఇవ్వాలని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల గౌరవ అధ్యక్షులు తిరుపతిరావు, యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు, వై.శ్యామలరావు, ఆర్.సతీష్ డిమాండ్ చేశారు. శ్రీకాకుళం నగరంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ఇంజనీరింగ్ కార్మికుల 18వ రోజులుగా చేపడుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ నిరవధిక సమ్మెలో భాగంగా ఆదివారం వంటా–వార్పు కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్చలకు పిలవాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కార్మికులు, వర్క్ ఇన్‌స్పెక్టర్, కంప్యూటర్ ఆపరేటర్లు, డీపీఓ, సెక్యూరిటీ గార్డ్స్, పార్క్ వర్కర్స్, గ్యాంగ్ మజ్దూర్, వాటర్ వర్క్స్ వర్కర్స్, ఎలక్ట్రికల్ వర్కర్స్, అటెండర్స్ తదితరులు పాల్గొన్నారు.

అసిరితల్లి సంబరాలకు ముహూర్తం ఖరారు



సిరిమానోత్సవ తేదీలను ప్రకటిస్తున్న ఇప్పిలి శంకరశర్మ

అరసవల్లి: అరసవల్లి-కాజీపేట గ్రామదేవత అసిరితల్లి అమ్మవారి సిరిమానోత్సవ సంబరాలకు ముహూర్తం ఖరారయ్యింది. వచ్చే ఏడాది వైశాఖ శుద్ధ ద్వాదశి ఏప్రిల్ 28న మంగళవారం అమ్మవారి సంబరాల్లో కీలకమైన సిరిమానోత్సవం జరిపేందుకు గ్రామ పెద్దలు నిర్ణయించారు. ఈ మేరకు ఆదివారం అసిరితల్లి అమ్మవారి ఆలయంలో నిర్వహించిన గ్రామ పెద్దల సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆదిత్యాలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ మాట్లాడుతూ వచ్చే ఏడాది ఘనంగా నెల రోజుల పాటు సంబరాలు, సిరిమానోత్సవం జరుగుతాయని చెప్పారు. అనంతరం పలువురు పెద్దలు మాట్లాడుతూ గతంలో తలెత్తిన లోపాలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని, నిర్వహణ కమిటీల్లో యువతరానికి ప్రాధాన్యమివ్వాలని కోరారు. గ్రామ పెద్దల నిర్ణయంపై అరసవల్లి, కాజీపేట, ఆదిత్యనగర్ కాలనీ, కామేశ్వర నగర్, లక్ష్మీనగర్ వాసులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, శిమ్మ సూర్యనారాయణ, తెలుగు మంగయ్య, ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, ఉంగటి రమణమూర్తి, నక్క రామకృష్ణ, నక్క నారాయణమూర్తి, ఉంగటి పాపారావు, తెలుగు సూర్యనారాయణ, సీర చిన్నారావు, కునుకు గోవింద్, రుప్ప అప్పన్న, తెలుగు జగదీష్, దుంగ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

దూడకు అరుదైన చికిత్స



దూడకు ఆపరేషన్ చేస్తున్న డాక్టర్ సుభాష్ చంద్రబోస్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): దూసి గ్రామంలో దుప్పల అప్పారావుకు చెందిన లేగదూడ రెండు కాళ్లు వంకరతో పుట్టడంతో డాక్టర్ సుభాష్ చంద్రబోస్ వైద్యం చేసి సాధారణ స్థితికి తీసుకొచ్చారు. శ్రీకాకుళం నగరంలోని పశువైద్యశాలలో ఆదివారం రెండు, మూడు గంటలు పాటు శ్రమించి ఆపరేషన్ చేసి అల్యూమినియం స్ట్రిప్‌తో కట్టు వేసి కాపాడారు. దీంతో రైతు ఆనందం వ్యక్తం చేశారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు స్వస్తి పలకాలి



రౌడీషీటర్లకు సూచనలిస్తున్న పోలీసు అధికారులు

శ్రీకాకుళం క్రైమ్: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉంటూ నేర ప్రవృత్తికి స్వస్తి పలికి సత్ప్రవర్తనతో మెలగాలని పోలీసు అధికారులు సూచించారు. జిల్లాలో పలు పోలీసుస్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీ షీటర్లకు ఆదివారం కౌన్సిలింగ్ ఇచ్చారు. పోలీసుల ఆదేశాలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద రౌడీ షీటర్లను పిలిచి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, ఘర్షణలకు దూరంగా ఉండాలన్నారు. ఎటువంటి అసాంఘిక కార్యక్రమాల్లో పాల్గొనవద్దన్నారు. రౌడీషీటర్లపై ఎల్లప్పుడూ పోలీసు నిఘా ఉంటుందన్నారు.

ఖుర్దారోడ్ హాఫ్ మారథాన్ విజయవంతం



జెండా ఊపి హాఫ్ మారథాన్ ప్రారంభించిన అతిథులు

భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వే క్రీడా సంఘం (ఈకోర్సా), భారతీయ సాంకేతిక సంస్థ (ఐఐటీ) భువనేశ్వర్ సమన్వయంతో ఆదివారం నిర్వహించిన ఖుర్దారోడ్ హాఫ్ మారథాన్ భువనేశ్వర్ 2025 విజయవంతమైంది. స్థానికుల్లో శారీరక దారుఢ్యతపై చైతన్యపరిచే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు స్థానిక మండల రైల్వే అధికారి డీఆర్ఎం హెచ్ ఎస్ బజ్వా తెలిపారు. ఎనిమిదేళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న పురుషులు, మహిళలు, బాలబాలికలు సహా 1,200 మందికి పైగా ఔత్సాహిక వ్యక్తులు ఈ భారీ పరుగు కార్యక్రమంలో ఉత్సాహంతో పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో అర్జున అవార్డు గ్రహీత ద్యుతీ చాంద్, డీఆర్ఎం హెచ్ఎస్ బజ్వా, తూర్పు కోస్తా రైల్వే మహిళా సంక్షేమ సంస్థ ఖుర్దారోడ్ శాఖ అధ్యక్షురాలు గుర్ సిమ్రాన్ కౌర్, ఐఐటీ, భువనేశ్వర్ ప్రొఫెసర్ రాజేష్ రోషన్ దాస్ జెండా ఊపి హాఫ్ మారథాన్ ప్రారంభించారు. కార్యక్రమంలో సుబ్రజ్యోతి మండల్, అదనపు మండల రైల్వే అధికారి (ఇన్‌ఫ్రా), పీకే బెహరా అదనపు మండల రైల్వే అధికారి (ఓపీ), క్రీడాధికారి హిమాద్రి భూషణ్ బిస్వాల్ పాల్గొన్నారు.

హాఫ్ మారథాన్ స్థానిక రైల్వే స్టేడియం నుంచి ప్రారంభమై ఐఐటీ భువనేశ్వర్ నుంచి వెనుకకు మలుపు తిరిగి (యూ–టర్న్) రైల్వే స్టేడియంలో ముగిసింది. నాలుగు విభాగాలుగా పోటీ నిర్వహించారు. వాటిలో 21.1 కిలో మీటర్ల టైమ్ రన్, 10 కిలో మీటర్లు టైమ్ రన్, 5 కిలో మీటర్లు ఫన్ రన్, 2 కిలోమీటర్ల ఫన్ రన్ ఉన్నాయి. విజేతలకు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రదానం చేశారు. సమగ్రంగా 2 లక్షల రూపాయల నగదు బహుమతులు అందజేశారు. మొత్తం 24 మంది విజేతలు బహుమతులు అందుకున్నారు.

ఊర్మిల ఝలక్

విజయవంతమైన ఖుర్దారోడ్ హాఫ్ మారథాన్ భువనేశ్వర్ 2025 పరుగు పందెంలో 74 ఏళ్ల వయో వృద్ధ మహిళ ఊర్మిళ దాస్ తళుక్కుమన్నారు. 7 దశాల వయసు మీరిన ఊర్మిళ అలుపు ఎరగకుండా సుదీర్ఘంగా 5 కిలో మీటర్ల ఫన్ రన్‌లో అత్యంత ఉత్సాహంగా పాల్గొని అందరి దృష్టిని ఆకట్టుకున్నారు. మారథాన్‌లో పాల్గొన్న అతి పెద్ద వయస్కురాలిగా ఆమెను ప్రత్యేకంగా సత్కరించి అభినందించారు.



హాఫ్ మారథాన్ తారగా ఊర్మిల దాస్‌కు సత్కారం

బీజేడీలోకి పలువురి చేరిక



మాట్లాడుతున్న దిలీప్ ప్రధాని, పక్కన ఎంపీ మున్నా ఖాన్, ఎమ్మెల్యే రంధారి, మాజీ మంత్రి రమేష్, మాజీ ఎమ్మెల్యే సదాశివ ప్రధాని

కొరాపుట్: కాంగ్రెస్ పార్టీ తరఫున గత సార్వత్రిక ఎన్నికల్లో నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన దిలీప్ ప్రధాని బీజేడీ పార్టీలో చేరారు. ఆదివారం శంఖ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో దిలీప్ చేరికను ఒడియా సినీ హీరో, రాజ్యసభ ఎంపీ మున్నా ఖాన్ ప్రకటించారు. తెంతుల కుంటి సమితిలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన నలుగురు సమితి సభ్యులు, ముగ్గురు సర్పంచ్‌లు బీజేడీలో చేరారు. వీరిని పార్టీ జిల్లా అధ్యక్షుడు, డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారి, మాజీ మంత్రి రమేష్ చంద్ర మఝ్జి, మాజీ ఎమ్మెల్యే సదాశివ ప్రధాని, జెడీపీ సభ్యుడు అరుణ్ మిశ్ర స్వాగతం పలికారు.

ఎందుకీ పార్టీ ఫిరాయింపు...

సార్వత్రిక ఎన్నికల తర్వాత అనేక ప్రాంతాల్లో బీజేడీ, కాంగ్రెస్‌లను వీడి అనేక మంది అధికార బీజేపీలో చేరారు. కానీ నబరంగ్‌పూర్ జిల్లాలో బీజేడీలో చేరికల పట్ల అనేక రాజకీయ మలుపులు ఉన్నాయి. నబరంగ్‌పూర్ నుంచి 9 సార్లు ఎంపీగా గెలిచిన ఖగుపతి ప్రధాని మనుమడు దిలీప్ ప్రధాని. ఇదే స్థానంలో ఖగుపతి తమ్ముడు మాజీ జెడీపీ ప్రెసిడెంట్ కుమారుడైన సిట్టింగ్ ఎమ్మెల్యే సదాశివ ప్రధాని బీజేడీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. అంతకు ముందు జరిగిన మూడంచెల పంచాయతీ ఎన్నికల్లో తనను తెంతులకుంటి సమితి చైర్మన్ చేయమని సదాశివను దిలీప్ అభ్యర్థించారు. దిలీప్ కాంగ్రెస్‌ను వీడి బీజేడీలోనికి వస్తే చైర్మన్ చేస్తామని సదాశివ బదులిచ్చారు. దిలీప్ పార్టీ మారకపోవడంతో బీజేడీకి చెందిన నీలాద్రిని చైర్మన్‌ను చేశారు. దీంతో స్వంత చిన్నాన్న సదాశివను ఓడిస్తానని ప్రతిన బూని దిలీప్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో ఇద్దరూ ఓడిపోయి బీజేపీ అభ్యర్థి గౌరి శంకర్ మఝ్జి గెలిపొందారు. దిలీప్ ప్రస్తుతం తెంతులకుంటి సమితి సభ్యునిగా ఉన్నారు. తెంతులకుంటి సమితి చైర్మన్‌గా బీజేడీకి చెందిన నీలాద్రి మఝ్జిపై పార్టీ నాయకులు అసంతృప్తితో ఉన్నారు. ఇది తెలిసిన పార్టీ జిల్లా అధ్యక్షుడు మనోహర్ రంధారి రంగంలోకి దిగి దిలీప్ ప్రధానితో చర్చలు జరిపారు. ఉన్న చైర్మన్‌ను అవిశ్వాసం పెట్టి దించేస్తామని హామీ ఇచ్చారు. గతం మర్చిపోయి బీజేడీలో చేరితే అందరం కలిసి చైర్మన్ చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో దిలీప్ తన మద్దతుదారులతో బీజేడీలో చేరారు.

రథ నిర్మాణాలకు కలెక్టర్ ప్రారంభ పూజలు

కొరాపుట్: కొరాపుట్ జిల్లా కేంద్రంలోని శబరి శ్రీ క్షేత్రంలో రానున్న జగన్నాథ రథయాత్ర కోసం రథాల నిర్మాణ ప్రారంభ పూజ జరిగింది. ఆదివారం కలెక్టర్ వీ.కీర్తి వాసన్ ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు నేటి నుంచి రథ విడిభాగాలను కలిపే కార్యక్రమం ప్రారంభించమని రథ శిల్పులకు ఆదేశించారు. కొరాపుట్ రథయాత్రలో దేవ దేవుళ్లైన జగన్నాథ, సుభద్ర, బలబద్రలకు వేర్వేరుగా రథాలు వినియోగిస్తారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ లలెటెందు రంజన్ శెఠి పాల్గొన్నారు.



కొరాపుట్‌లో రథాల నిర్మాణానికి ప్రారంభ పూజలు చేస్తున్న కలెక్టర్ వి.కీర్తివాసన్

సిటిజన్ కమిటీ నూతన కార్యవర్గం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

జయపురం: జయపురం సిటిజన్ కమిటీ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం జరిగాయి. సంఘ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షురాలిగా బినోదిని శాంతపాత్రో, సాధారణ కార్యదర్శిగా విష్ణు వర్ధన రెడ్డి, ఉపాధ్యక్షులుగా మదన మోహననాయిక్, దేవేంద్రబాహిణీపతి, భవానీ శంకర ఆచార్య, సహాయ కార్యదర్శులుగా హరిహర కరసుధా పట్నాయక్, డాక్టర్ నీలాచల ప్రధాన్, జానకీ పాణిగ్రహి, కోశాధికారిగా రబినారాయణ నందో, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సుభాష్ చంద్ర పండ, కార్యవర్గ సభ్యులుగా సత్యబ్రత పండ, పరమేశ్వర పాత్రో, రత్నాకర చౌధురి, ఇంజనీర్ కేదార్ నాథ్ బెహర, నరశింగ పాణిగ్రహి, గీతా ప్రకాశ్ చంద్ర మిశ్ర, నరశింగ చౌదురి, జదాబ్ సుబుద్ధి, రామ నాయిక్, భీమసేన్ అగర్వాల్, జి.వెంకటేశ్వరరావు, పి.మహేశ్వరరావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా డాక్టర్ సురేష్ దాస్ వ్యవహరించారు. నూతన కార్యవర్గంతో డాక్టర్ దాస్ ప్రమాణ స్వీకారం చేయించారు.

సైకిల్ తిరంగా ర్యాలీ

భువనేశ్వర్: స్థానిక కళింగ స్టేడియంలో 25వ సండేస్ ఆన్ సైకిల్ ర్యాలీని ఆదివారం నిర్వహించారు. ప్రపంచ సైకిల్ దినోత్సవం పురస్కరించుకుని తిరంగ ర్యాలీని నిర్వహించడం విశేషం. ఈ కార్యక్రమం భారత సాయుధ దళాలకు అంకితమని ప్రకటించారు. రాష్ట్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ డైరెక్టర్ దీపంకర్ మహాపాత్రో, అదనపు కార్యదర్శి అశోక్ కుమార్ పండా, ఇతర సీనియర్ అధికారుల సమక్షంలో ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు.



జెండా ఊపి సండేస్ ఆన్ సైకిలు తిరంగా ర్యాలీ ప్రారంభించిన అతిథులు

ఘనంగా శీతల షష్టి



కోమటి వీధిలో శివపార్వతుల విగ్రహాల ఊరేగింపు

పర్లాకిమిడి: పట్టణంలో తెలుగు సోండి వీధి వద్ద బలుంకేశ్వర మందిరంలో శీతల షష్టి సందర్భంగా శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆదివారం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను తిరువీధి ఉత్సవం జరిపించారు. పట్టణంలో పలు వీధుల్లో శివపార్వతుల దర్శనాన్ని భక్తులకు కల్పించారు.

గాంధీ విగ్రహావిష్కరణ



గాంధీ విగ్రహం

రాయగడ: స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానం ఎదురుగా గల గాంధీ పార్క్ ప్రవేశ ద్వారం ఎదుట మున్సిపాలిటీ యంత్రాంగం ఆధ్వర్యంలో 21 అడుగుల భారీ గాంధీ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. కొరాపుట్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక ముఖ్యఅతిథిగా పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కడ్రక, మున్సిపల్ కౌన్సిలర్‌లు, పట్టణ ప్రముఖులు హాజరయ్యారు. గాంధీ పార్క్ నిర్వహణలో జాగ్రత్త చర్యలను మున్సిపల్ యంత్రాంగం తీసుకోవాలని ఎంపీ సూచించారు. ఎంతో మంది పిల్లలు ఇక్కడకు వచ్చి ఆనందంగా, ఉల్లాసంగా ఆడుకుంటున్నారని, పార్క్‌ను మరింత సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. మరికొన్ని వినోదాత్మక, ఆటల పరికరాలను పార్క్‌లో ఏర్పాటు చేయాలని సూచించారు.

సాహిత్యంతో మానసిక ఉల్లాసం



మాట్లాడుతున్న నాగరాజు, వేదికపై అప్పారావు, బాలకృష్ణ, తదితరులు

రాయగడ: సంగీత, సాహిత్యాలు మానసిక ఉల్లాసం కలిగిస్తాయని ప్రముఖ రచయిత, కవి భళ్లమూడి నాగరాజు అన్నారు. స్థానిక రాజ్‌భవన్ సమావేశం హాల్‌లో ఆదివారం రాయగడ రచయితల సంఘం (రారాసం) నిర్వహించిన సాహితీ సదస్సులో ప్రసంగించారు. రోజురోజుకూ సాహిత్యంపై యువతకు ఉత్సుకత తగ్గుముఖం పడుతుందన్నారు. సాహిత్యం, తెలుగు భాషపై వారికి పట్టు ఉండేలా సాహితీ సంస్థలు నడుం బిగించాలన్నారు. ఇటువంటి తరహా కార్యక్రమాలను నిర్వహించి వారిని ప్రోత్సాహించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మంచి సాహిత్యం ఎప్పటికీ మనసుల్లో నిండి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్పందన సాహితీ, సాంస్కృతిక సంస్థకు చెందిన డాక్టర్ పతివాడ తులసీ దాస్ వేమన సాహిత్యంపై ప్రసంగించారు. ఎస్.రామారావు, బాలకృష్ణ పట్నాయక్‌లు స్వీయ కవితలు చదివి వినిపించారు. బి.హెచ్.నాగేశ్వరరావు ఆంజనేయ చరిత్ర వినిపించారు. డాక్టర్ బాబూరావు మహంతి, టి.టౌరి తదితరులు సాహితీ గోష్టిలో పాల్గొన్నారు. రారాసం అధ్యక్షుడు టి.వి.ఎస్.ఆర్.అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో పిల్లల శంకరరావు, చిన్నారి చక్రధర్, బి.గౌరీ శంకర్, పి.చరణ్ తేజ, బరాటం అవంతి, వర్ధమాన గాయనీ, గాయకులు ఆలపించిన మధుర గీతాలు అలరించాయి.

ఊపందుకున్న రథాల పనులు



నిర్మాణపు పనుల్లో జగన్నాథ స్వామి రథం

పర్లాకిమిడి: జగన్నాథ రథయాత్ర కోసం పట్టణంలోని రాజవీధిలో మూడు రథాల తయారీ పనులు ఊపందుకున్నాయి. కాశీనగర్ బ్లాక్ సింగిపురం నుంచి పది మంది వడ్రంగులు, పర్లాకిమిడి నుంచి మరో ఐదుగురిని ప్రస్తుతం నియమించినట్టు రథయాత్ర రథాల కమిటీ తెలియజేశారు. జగన్నాథ, బలభద్ర, సుభద్ర రథాలు తయారు చేయడానికి సిద్ధమవుతున్నారు. మూడు రథాల తయారీకి ప్రస్తుతం పనులు జరుగుతుండగా అవసరమైన నూతన కలప ఫారెస్టు అధికారులు సమకూర్చుతున్నట్టు రథాల కిరిగోరో అశోక్ మహారాణా తెలియజేశారు. వర్షాలు ఆటంకం లేకుండా వుంటే, ఈ మూడు రథాల పనులు జూన్ 26 తేదీకు ముందు పనులు పూర్తవుతాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు.



పర్లాకిమిడిలో చురుగ్గా రథాల పనులు



కొత్త శ్రీమందిరం పనులు కూడా సాగుతున్న వైనం



రథ చక్రాల పనుల్లో నిమగ్నమైన వడ్రంగులు

వైభవంగా శివపార్వతుల కల్యాణం



స్వామివారి ఊరేగింపులో భక్తులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలోని తోలసాయి (దిగువవీధి)లో ఉన్న శివాలయంలో శీతల షష్టి సందర్భంగా ఆదివారం శివపార్వతుల కల్యాణాన్ని ఉత్సవ కమిటీ సభ్యులు వైభవంగా నిర్వహించారు. శివుని తల్లిదండ్రులుగా సతీష్ చౌదరీ, సంధ్యరాణి దంపతులు పీటలపై కూర్చున్నారు. పార్వతీదేవి తల్లిదండ్రులుగా రాజేంద్ర కొతియా, సంజులతా దంపతులు కన్యాదానం చేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

ప్రదర్శన అదరహో..



శ్రీకాకుళం నగరానికి చెందిన శివశ్రీ నృత్య కళానికేతన్ వ్యవస్థాపకులు డాక్టర్ రఘుపాత్రుని శ్రీకాంత్ శిష్య బృందం జపాన్‌లో జరుగుతున్న వరల్డ్ ఎక్స్‌పో–2025లో తమ అద్భుత ప్రదర్శనలతో అలరిస్తున్నారు. ఐదో రోజు పర్యటనలో భాగంగా ప్రదర్శించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు సహకారంతో జరుగుతున్న ఈ పర్యటన బృందంలో రామకౌండిన్య, నేహా, వర్ధిత, నేహా థామస్, లలిత, చాందిని ఉన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

'సైబర్'కు సిబ్బంది కొరత

- ప్రస్తుతమున్న సిబ్బందిపై పని భారం
- మాటలకే పరిమితమైన సైబర్ పోలీస్ స్టేషన్



శ్రీకాకుళం క్రైమ్ : సైబర్ ఫ్రాడ్స్.. ప్రపంచం ప్రజలు ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య.. చిన్నోళ్లని చిదిమేస్తుంది.. పెద్దోళ్లను కబళించేస్తుంది.. తారతమ్యాల్లేవు.. ఎంతటి తెలివైన వారైనా సరే ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా సైబర్ మోసగాళ్ల వలలో పడి ఆర్థికంగా చితికిపోవాల్సిందే. నిన్న మొన్నటి వరకు జిల్లాలో మేజర్ సైబర్ కేసులు (రూ. 5 లక్షల నుంచి రూ. 50 లక్షల్లోపు) అధికంగా నమోదయ్యాయి. ఇటీవల ప్రజల్లో ముఖ్యంగా విద్యార్థులు, యువత, ఉద్యోగస్తుల్లో వీటిపై అవగాహన ఏర్పడటం.. ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలోని జిల్లా పోలీసు యంత్రాంగం ఎప్పటికప్పుడు విద్యాసంస్థలు, స్టేషన్ పరిధి ముఖ్య కేంద్రాల్లో అవగాహనా సదస్సులు నిర్వహించడం తదితర కారణాలతో కేసుల సంఖ్య కాస్తు తగ్గుముఖం పట్టింది. రూ. 10 వేలు నుంచి రూ. 20 వేలు లోపు చిన్న చిన్న కేసులు నమోదవుతున్నాయి.

అరకొరగా సిబ్బంది..

జిల్లాలోని ఐటీ కోర్ విభాగంలో ఓ ఏఎస్ఐతో కలిపి పది మంది సిబ్బంది ఉన్నారు. వారిలో హెచ్‌సీలు ముగ్గురు, మిగతా వారంతా కానిస్టేబుళ్లే. సైబర్ సెల్ విభాగానికొస్తే ముగ్గురు కానిస్టేబుళ్లు మాత్రమే ఉన్నారు. రెండు విభాగాలకు ఇన్‌చార్జిగా సీఐ శ్రీనివాస్ ఉన్నారు. గతంలో ఇదే సైబర్ సెల్ విభాగానికి సాంకేతికతపై మెండుగా అవగాహన ఉన్న ఐదారుగురికి మించి సిబ్బంది ఉండేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఎన్నికల ఫలితాలొచ్చి కూటమి ప్రభుత్వమేర్పడ్డాక.. అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అనుకూలురుగా వ్యవహరించారని ముద్రపడి వీఆర్‌కు పంపించేశారు. కొంతమంది ఎస్ఐలు, దిగువ స్థాయి సిబ్బంది ఉన్నా వేరే కేసుల్లోనే వినియోగించుకోవడం.. సాంకేతికతపై ఎక్కువశాతం మందికి పట్టు లేకపోవడం ఇబ్బందికి కారణంగా కనిపిస్తోంది.

తగ్గని విధుల ఒత్తిడి..

జిల్లాలో వినూత్నమైన కేసులు ప్రస్తుతం నడుస్తున్నాయి.. నిన్న మొన్నటి వరకు అన్యమత ప్రచారాల కేసు, భారీ చోరీ కేసులు, నకిలీ కరెన్సీ, మిస్సింగ్ వంటి కేసుల్లో టెక్నికల్‌గా ఛేదించే పనిలో పడ్డ సైబర్ నిపుణులు ప్రస్తుతం జిల్లాను పట్టి పీడిస్తున్న బెట్టింగ్, గ్యాంబ్లింగ్ వంటి జూదాల్లో మునిగి తేలుతున్న ప్రధాన బుకీలు, ఏజెంట్లు, వారి లింకులు టెక్నాలజీ పరంగా కనిపెట్టడంలో బిజీగా ఉన్నారు. ఇంత చేసినా బందోబస్తులకు, విజయవాడ శిక్షణా కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి తప్పడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాకో సైబర్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. అది మాటలకే పరిమితమైంది. ఒకవేళ వచ్చినా సాంకేతికంగా నిపుణులైన పోలీసు సిబ్బంది అందుబాటులో ఉంటారా లేదా అన్నది వేచి చూడాల్సిందే.

క్లుప్తంగా

కరాటేలో బాలుడి ప్రతిభ



బాలుడికి ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న నిర్వాహకులు

సీతంపేట: విశాఖపట్నంలో ఆదివారం జరిగిన సౌత్ ఇండియా కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో పెద్దూరుకు చెందిన ఆరిక యాగ్నిక్ మంచి ప్రతిభ కనబర్చాడు. పోటీల్లో మొదటి బహుమతి సాధించడంతో యగ్నిక్‌ను గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



సంఘటనా స్థలంలో రాంమోహన్

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం గ్రామ శివారులోని ఎర్రచెరువు ప్రధాన రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పత్తిక రాంమోహన్ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. గుమ్మలక్ష్మీపురం మండలం ఎల్విన్‌పేట గ్రామంలోని ప్రతిభాభారతి కాలనీకి చెందిన రాంమోహన్ ఆదివారం కురుపాంలో పనులు ముగించుకుని లగేజీ ఆటోతో తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి వెళ్తుండగా కురుపాం దాటగానే వచ్చే ఎర్రచెరువు మలుపువద్ద ప్రమాదవశాత్తు చెట్టును బలంగా ఢీ కొన్నాడు. ఈ ప్రమాదాన్ని గమనించిన సాటి వాహనదారులు లగేజ్ ఆటోలో ఇరుక్కున్న రాంమోహన్‌ను బయటికి తీసి అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి వైద్యం నిమిత్తం 108 సిబ్బంది తరలించారు. తలకు చిన్నపాటి గాయం, కాలు విరిగిపోవడంతో ప్రాథమిక వైద్య సేవల అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం క్షతగాత్రుడిని పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి వైద్యులు రిఫర్ చేశారు. ఈ సంఘటనపై దర్యాప్తు నిర్వహించనున్నట్లు కురుపాం పోలీసులు తెలిపారు.

బాలుడికి తీవ్ర గాయాలు

కొత్తవలస: మండలంలోని అరకు-విశాఖ జాతీయ రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు తీవ్రగాయాల పాలయ్యాడు. దీనిపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తవలస నుంచి ఎల్.కోట వైపు ఆటో వెళ్తుండగా ఎదురుగా వచ్చిన కారు ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న కొత్తవలసకు చెందిన బాలుడు తీవ్రగాయాల పాలయ్యాడు. వెంటనే స్థానికులు 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఆటో,కారు పూర్తిగా దెబ్బతిన్నాయి. రోడ్డుసేఫ్టీ పోలీసులు హుటాహుటిన వచ్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

బైక్‌పైనుంచి కింద పడి మహిళకు గాయాలు

రామభద్రపురం: మండలకేంద్రంలోని టీబీఆర్ సినిమా థియేటర్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలయ్యాయి. ఈ సంఘటనపై స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రేగాల శ్రీనివాసరావు ఆయన భార్య కల్యాణి విశాఖపట్నం జిల్లా గాజువాక నుంచి ద్విచక్రవాహనంపై పార్వతీపురం జిల్లాలోని చెక్కవలస వివాహానికి వెళ్తున్నారు. రామభద్రపురంలోని థియేటర్ వద్దకు వచ్చేసరికి కల్యాణికి చెందిన చున్నీ వాహనం వీలుకు చుట్టుకోవడంతో బైక్‌పై నుంచి ఆమె ప్రమాదవశాత్తు కింద పడిపోగా తలకు గాయమైంది. దీంతో స్థానిక ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. తరువాత మెరుగైన వైద్యం కోసం విజయనగరం ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతోంది.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం



అప్పలనాయుడు(ఫైల్)

సీతానగరం: మండలంలోని గుచ్చిమి-జోగింపేట గ్రామాల మధ్య రైల్వేట్రాక్ దాటుతున్న గుచ్చిమి గ్రామానికి చెందిన మరిపి అప్పలనాయుడి(33)ని ఆదివారం ఉదయం రైలు ఢీకొట్టడంతో దుర్మరణం చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించిన రైల్వే హెచ్‌సీ రత్నకుమార్ మాట్లాడుతూ గుచ్చిమి గ్రామానికి చెందిన వ్యక్తి ఆదివారం ఉదయం తోటకు వెళ్లడానికి ఇంటినుంచి బయల్దేరి మార్గమధ్యంలో ఉన్న రైల్వే ట్రాక్ దాటుతుండగా ప్రమాదం జరిగిందన్నారు. ట్రాక్ పక్కనే ఉన్న మృతదేహాన్ని గమనించిన రైల్వేసిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు.

రేషన్ పంపిణీ పరిశీలన

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని కేఎల్‌పురంలో 281098 నంబర్ రేషన్ షాపును జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ ఆదివారం పరిశీలించారు. సరుకుల నిల్వపై ఆరా తీశారు. సరుకులను సకాలంలో పంపిణీ చేయాలని డీలర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఆయన వెంట డీఎస్‌వో మధుసూదన్‌రావు, సీఎస్‌డీటీ రామారావు పాల్గొన్నారు.

అమ్మో..జూన్..!

అమ్మా..నాన్నా..కొత్త బ్యాగు, కొత్త పుస్తకాలు..కొత్త యూనిఫాం..కొత్త షూస్ కావాలని పిల్లలు ఇంట్లో అడుగుతుంటే ఆ తల్లిదండ్రుల గుండెలు బరువెక్కుతున్నాయి. ఆకాశం వైపు.. పొలంవైపు చూస్తూ..ఈ ఏడాది వరిపంట వేయాలి. సాగుకు పెట్టుబడి సాయం కోసం ఏర్పాటు చేసుకోవాలన్న ఆలోచన మదిలో మెదలగానే అన్నదాతల కళ్లలో నీళ్లు తిరుగుతున్నాయి. ఏటా జూన్ నెల వచ్చిందంటే చాలు. పిల్లల తల్లిదండ్రులు..అన్నదాతలు..కంటికీ కనిపించని శత్రువుతో మానసిక యుద్ధం చేయాల్సిందే.

- తల్లిదండ్రులకు ఫీజుల భారం
- రైతులకు పంట సాగు పెట్టుబడి ఆందోళన



ఉల్లిభద్రలో దుక్కులు చేస్తున్న రైతులు



తరగతి గదిలో పాఠాలు వింటున్న విద్యార్థులు

పార్వతీపురం:

జూన్ మాసం వచ్చిందంటే మధ్యతరగతి కుటుంబాలు, రైతుల్లో ఆందోళన నెలకొంటుంది. పాఠశాలలు, కళాశాలల పునఃప్రారంభంతో విద్యార్థుల తల్లిదండ్రులపై ఫీజుల భారం..రైతులకు పంటల సాగులో పెట్టుబడుల భారం తప్పడం లేదు. పిల్లలకు ఫీజులు, వసతి ఖర్చులు, తలుచుకుని తల్లిదండ్రులు జూన్ నెల వచ్చేసిందంటూ ఆందోళన చెందడం పరిపాటిగా మారింది. పాఠశాలల ప్రారంభానికి ముందే ప్రైవేట్ పాఠశాల సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ విద్యార్థులను గాలించారు. ప్రాథమిక పాఠశాల విద్య పూర్తయిన వారిని ఉన్నత పాఠశాలకు, ఉన్నత విద్య పూర్తయిన వారిని తమ కళాశాలలో చేర్పించాలంటూ ఒకటికి రెండుసార్లు ఒత్తిడి తెచ్చి ఆయా పాఠశాలలు, కళాశాలల్లో చేర్పించుకున్నారు. గరుగుబిల్లి, కురుపాం, జియ్యమ్మవలస, కొమరాడ, గుమ్మలక్ష్మీపురం తదితర మండలాల నుంచి పలువురు విద్యార్థులను సమీపంలోని పార్వతీపురం, విజయనగరం, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాలలకు పంపించేందుకు తల్లిదండ్రులు మక్కువ చూపుతున్నారు. రోజూ పదుల సంఖ్యలో పాఠశాలకు చెందిన బస్సులు విద్యార్థులను తీసుకువెళ్లేందుకు గ్రామాలకు వస్తున్నాయి. అదేవిధంగా ప్రస్తుతం రైతులు ఖరీఫ్‌లో సాగుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం పంట పెట్టుబడికి రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇటు వ్యవసాయ మదుపులు, అటు కళాశాల, పాఠశాలల ఫీజుల భారంతో సగటు మనిషి ఆర్థిక ఇబ్బందులు వర్ణణాతీతంగా ఉన్నాయి. ఇదిలా ఉండగా గత ప్రభుత్వం వ్యవసాయానికి పెట్టుబడి సాయంకింద ఏటా రూ.14వేలు అందించి రైతులను ఆదుకోవడంతోపాటు అమ్మ ఒడి పథకం ద్వారా రూ.15వేలు అదించించి తల్లిదండ్రులకు భారాన్ని తగ్గించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు వ్యవసాయానికి పెట్టుబడి సాయంకానీ, చదువుకున్న విద్యార్థుల తల్లిదండ్రులకు తల్లికి వందనం పథకం ద్వారా ఆర్థిక సహాయాన్ని కానీ అందించలేదు. ఈ కారణంగా రైతులు, విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సాగుకు భారం

జిల్లాలోని పదిహేను మండలాల్లో 1.77 లక్షల ఎకరాల్లో 52, 500 మంది రైతులు ఖరీఫ్‌లో వరిపంటను సాగుచేస్తున్నారు. ఎకరా వరి పంటను సాగుచేయాలంటే రూ.15వేల నుంచి రూ. 20వేలవరకు మదుపు అవుతుంది. ప్రస్తుతం ఆయాగ్రామాల్లో పదుల సంఖ్యలో రైతులు కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల తోటలను సాగు చేసి కుటుంబ పోషణ చేస్తున్నారు. రైతులు ఖరీఫ్‌కు తమ పంట పొలాలను సాగుకు సిద్ధం చేస్తున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి వరిపంటను సాగు చేసేందుకు సమాయత్తమవుతున్నారు. చేతిలో నగదు లేకపోయినా అప్పులు చేసైనా పంటలు పండించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ ఏడాది ఆశాజనకంగా వర్షాలు కురవడంతో ఖరీఫ్ పనులపై ఆశ రైతుల్లో పెరుగుతోంది.

ఫీజుల మోత..

ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఫీజులు విద్యార్థుల తల్లిదండ్రులకు ఆందోళన కలిగిస్తున్నాయి. ఫీజులు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, బ్యాగుల కొనుగోలుకు వారి నెలవారీ బడ్జెట్ సరిపోవడం లేదు. ఫీజులు, బస్సు రవాణా, పుస్తకాల భారం తడిసి మోపెడవుతోంది. ప్రాథమిక పాఠశాల స్థాయికి రూ.15వేల నుంచి రూ.40వేల వరకు, ఉన్నత పాఠశాల స్థాయికి రూ. 25వేల నుంచి రూ.60వేల వరకు ఫీజులు చెల్లించాల్సి వస్తోంది. ఇంటర్మీడియట్‌కు కార్పొరేట్ కళాశాలల్లో రూ.80 వేల నుంచి రూ.2.50లక్షల వరకు ఖర్చవుతుంది. విద్య ఖర్చులు, సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు భారంగా ఉన్నాయి. అయినా పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని అప్పు చేసైనా చదివించేందుకే తల్లిదండ్రులు మొగ్గుచూపుతున్నారు. ఫీజుల వసూళ్లపై ప్రభుత్వం పర్యవేక్షణ కొరవడడం, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాల చెల్లింపులను నిఘాపరిధిలో చేర్చకపోవడంతో వారి ఇష్టారాజ్యంగా మారింది. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులను క్రమబద్ధీకరించడం, ఫీజుల వసూళ్లపై నిఘా వేయడం, ఇన్‌కంటాక్స్ దాడులను చేస్తే కొంతవరకైనా ఫీజులమోత తగ్గే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

దగాపడ్డ రైతులు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్నదాతలకు మొండిచేయి చూపి దగా చేసింది. పంట సాగుకు అవసరమైన నగదు చేతిలో లేకపోవడంతో అప్పులు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి సాయం అందించకపోవడంతో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

–బి.రవికుమార్,
ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి, పార్వతీపురం

మధ్య తరగతికి కష్టమే



జూన్ నెల వచ్చిందంటే మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భారం తప్పదు. మరికొద్ది రోజుల్లో పాఠశాలలను ప్రారంభించనున్న తరుణంలో పిల్లలకు పుస్తకాలు, యూనిఫాం కొనుగోలు చేయక తప్పదు. మిగిలిన నెలలతో పోలిస్తే జూన్ నెలలో ఖర్చులు అధికంగా ఉంటాయి. ఇటు చదువులకు, అటు వ్యవసాయానికి మదుపులు పెట్టాల్సి ఉంటుంది.

–శీర తిరుపతినాయుడు, కళ్లికోట, కొమరాడ మండలం

సైబర్ మోసాల పట్ల అప్రమత్తం

- ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసే అవకాశం
- టోల్ ఫ్రీ నంబర్ 1930
- ఎస్పీ వకుల్ జిందల్ సూచన



వకుల్ జిందల్, ఎస్పీ

విజయనగరం క్రైమ్: సైబర్ మోసాలకు పాల్పడే వారి పట్ల అప్రమత్తతే ప్రతి ఒక్కరి ఆయుధమని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. సైబర్ మోసాలకు గురైన వారు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చని అలాగే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ప్రజల అవగాహన లోపం కారణంగా సైబర్ మోసాలకు గురవుతున్నారన్నారు. సైబర్ మోసగాళ్ల చెప్పే మాయ మాటల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ వకుల్ జిందల్ పిలుపునిచ్చారు. సైబర్ మోసాల నియంత్రణలో వ్యక్తిగత సమాచారం, బ్యాంకింగ్ వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు లాంటి అంశాలను హ్యాకర్లు లేదా సైబర్ మోసగాళ్లు దుర్వినియోగం చేసే అవకాశం ఉన్నందున, వాటి వివరాలను ఎప్పుడూ ఇతరులతో పంచుకోవద్దని చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపించే లింకులు, అప్లికేషన్లను క్లిక్ చేయవద్దని, ఎవరైనా వ్యక్తిగత సమాచారం ఫోన్ ద్వారా అడిగితే ఇవ్వవద్దని, శంకించ దగిన వెబ్ సైట్లను వినియోగించవద్దని ప్రజలకు ఎస్పీ సూచించారు.

తైక్వాండో ఓవరాల్ చాంప్ మదర్ థెరిసా క్లబ్



ఓవరాల్ చాంపియన్‌షిప్ దక్కించుకున్న మదర్ థెరిసా క్లబ్ క్రీడాకారులు

విజయనగరం: జిల్లాస్థాయిలో జరిగిన తైక్వాండో బాల, బాలికల పోటీల్లో విజయనగరానికి చెందిన మదర్ థెరిసా క్లబ్ జట్టు సత్తా చాటింది. గత నెల 31న బొబ్బిలి వేదికగా జరిగిన పోటీల్లో పాల్గొన్న జట్టులోని 27 మంది క్రీడాకారులు బంగారు పతకాలు కైవసం చేసుకోవడంతో పాటు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను దక్కించుకున్నారు. అంతేకాకుండా ఈనెల 9,10,11 తేదీల్లో అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరగనున్న రాష్ట్రస్థాయి బాల, బాలికల తైక్వాండో పోటీలకు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించేందుకు అర్హత సాధించారు. జిల్లా స్థాయి పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా నిలవడంతో పాటు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన మదర్ థెరిసా క్లబ్ క్రీడాకారులను జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు, రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ వేణుగోపాలరావులు అభినందించారు.

నేలబావిలో పడి యువకుడి మృతి



మజ్జి తరుణ్ (ఫైల్)

పార్వతీపురం రూరల్: మండలంలోని నర్సిపురం గ్రామ సమీపంలో వెంకటరాయుడుపేట గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న వ్యవసాయ నేలబావిలో పార్వతీపురం పట్టణంలో గల జగన్నాథపురం ప్రాంతానికి చెందిన 10మంది స్నేహితులు ఈతకు వెళ్లారు. వారిలో పార్వతీపురం పట్టణంలోని తూర్పు వీధికి చెందిన మజ్జి తరుణ్ (23) ప్రమాదవశాత్తు నేలబావిలో మునిగిపోయి మృతిచెందాడు. ఈ మేరకు పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషికుమారి పేర్కొన్నారు. సమాచారం మేరకు ఘటనా స్థలానికి ఆమె చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

ముగిసిన బదిలీ ప్రక్రియ



బదిలీల ప్రక్రియలో పాల్గొన్న ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ

పార్వతీపురం: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో గిరిజన ఆశ్రమ, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది బదిలీ ప్రక్రియ గత నెల 29 నుంచి ఆదివారం వరకు ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ నేతృత్వంలో నిర్వహించగా ఆదివారం ఈ ప్రక్రియ ముగిసినట్లు పీఓ పేర్కొన్నారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు, వివిధ మాధ్యమాలకు సంబంధించిన ఉపాధ్యాయులు, అలాగే బోధనేతర సిబ్బందికి బదిలీలకు సంబంధించిన పత్రాలను ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో ఆయన ఆదివారం అందజేశారు.

జీఓ.23 అమలు సరికాదు

బదిలీలపై యూటీఎఫ్ కార్యదర్శి మురళీమోహన్ మాట్లాడుతూ బోధనేతర సిబ్బందికి సంబంధించిన జీఓ నంబర్ 23ను అనుసరించి బదిలీ ప్రక్రియ నిర్వహించడం సరికాదన్నారు. ఉపాధ్యాయుల బదిలీలకు జీఓ నంబర్ 22 మేరకు బదిలీల ప్రక్రియ చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాల తరఫున ప్రభుత్వానికి విన్నవించినప్పటికీ పట్టనట్లు వ్యవహరించడం పట్ల ప్రభుత్వం తీరుపై అసహనం వ్యక్తం చేశారు.

జాతీయస్థాయి దివ్యాంగుల పోటీలకు తోషిని ఎంపిక

- సన్మానించిన జిల్లా మంత్రి శ్రీనివాస్



జాతీయ స్థాయి దివ్యాంగుల క్రీడల పోటీలకు ఎంపికైన తోషినిని అభినందిస్తున్న జిల్లా మంత్రి శ్రీనివాస్

తెర్లాం: జాతీయస్థాయిలో జరగనున్న దివ్యాంగుల క్రీడల పోటీలకు తెర్లాం మండలకేంద్రానికి చెందిన అడ్డా తోషిని ఎంపికైంది. రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ఆటతీరు ప్రదర్శించిన తోషినిని శనివారం జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఘనంగా సన్మానించారని తెర్లాం హైస్కూల్ ప్రత్యేక ఉపాధ్యాయుడు సునీల్ ఆదివారం తెలిపారు. గత నెలలో ఏలూరు జిల్లా ఆరిగిపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి స్పెషల్ ఒలింపిక్స్ భారత్ పోటీల్లో తోషిని బోసిగేమ్‌లో పాల్గొంది. ఈ ఆటలో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించి గోల్డ్ మెడల్ కైవసం చేసుకుంది. రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో జాతీయ స్థాయి పోటీలకు తోషిని ఎంపికైంది. తోషిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల తెర్లాం హైస్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

నాలుగు వాహనాలు దగ్ధం

- ఆందోళనలో అపార్ట్‌మెంట్ వాసులు



మంటల్లో కాలిపోయిన వాహనాలు

కొత్తవలస: మండలంలోని రాజా థియేటర్ సమీపంలో గల వసంత్‌విహార్ అపార్ట్‌మెంట్ సముదాయం బ్లాక్-5లో సెల్లార్ కింద గల నాలుగు వాహనాలు అనుమానాస్పద స్థితిలో శనివారం రాత్రి దగ్ధమయ్యాయి. పి.లక్ష్మణరావు, కె.వెంకటస్వామిలకు చెందిన ద్విచక్రవాహనాలతో పాటు మరొకరికి చెందిన ఒక ద్విచక్రవాహనం, మారుతి-800 కారు పూర్తిగా దగ్ధమయ్యాయి. అర్ధరాత్రి 12 గంటల సమయంలో సెల్లార్ నుంచి ఒక్కసారిగా పెద్ద ఎత్తున పొగ రావడంతో అపార్ట్‌మెంట్ వాసులు దిగి చూసేసరికి వాహనాలు తగలబడిపోతున్నాయి. ఆర్పేందుకు ప్రయత్నించగా సాధ్యం కాకపోవడంతో కొత్తవలస అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. అప్పటికే వాహనాలు పూర్తిగా కాలిపోయాయి. పక్కనే గల విద్యుత్ మీటర్ల బోర్డుకు ఈ మంటలు వ్యాపించి ఉంటే పెనుప్రమాదం జరిగేదని అపార్ట్‌మెంట్ వాసులు భయాందోళన వ్యక్తం చేశారు. కాగా ఈ వాహనాలకు కావాలనే నిప్పు పెట్టారని అనుమానిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం



పోలీసులు కాపాడిన యువకుడు

విజయనగరం క్రైమ్: సాలూరుకు చెందిన ఓ పత్రిక విలేకరి కొడుకు విజయనగరంలోని జొన్నవలస రైల్వేట్రాక్‌పై ఆత్మహత్యాయత్నం చేయగా పోలీసులు కాపాడారు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. సాలూరులో 2019లో సీఐగా పనిచేసిన శ్రీనివాస్ పర్సనల్ ఫోన్ నంబర్‌కు ఆ విలేకరి ఫోన్ చేసి తన కొడుకు విజయనగరంలో రైల్వేట్రాక్ వద్ద ఆత్మహత్య చేసుకుంటున్నట్లు వీడియో సందేశం పెట్టాడని, తన కొడుకును కాపాడాలంటూ వేడుకున్నారు. దీంతో ప్రస్తుతం విజయనగరం వన్‌టౌన్ సీఐగా ఉన్న శ్రీనివాస్ విలేకరి ఫోన్ చేయగానే సరాసరి జొన్నవలస రైల్వేగేట్‌కు వెళ్లారు. అక్కడే కళ్లముందే రైల్వేట్రాక్‌పై యువకుడు పడుకోవడాన్ని చూసి వెనువెంటనే బయటకు లాగి ప్రాణాలు కాపాడారు. వివరాలు అడిగితే తాను చనిపోవాలని అనుకుంటున్నానని , ఎందుకో కారణం చెప్పక పోవడంతో వన్‌టౌన్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. అనంతరం యువకుడి తల్లిదండ్రులను పిలిపించి స్టేషన్‌లోనే ఆ కుర్రాడికి వన్‌టౌన్ సీఐ తన బృందంతో కౌన్సెలింగ్ ఇచ్చారు.

వామ్మో..రేడియేషన్..!

- మానవులు, వన్యప్రాణులపై మొబైల్ టవర్ల ప్రభావం

విజయనగరం గంటస్తంభం:

విచ్చలవిడిగా ఏర్పాటు చేసిన సెల్ టవర్లతో ప్రజలు రేడియేషన్ బారిన పడుతున్నారు. 3ఎ, 4ఎ, 5ఎ అని సిగ్నల్స్ కోసం వివిధ రకాల మొబైల్ కంపెనీలు విచ్చలవిడిగా జనవాస ప్రాంతాలలో సెల్ టవర్లు ఏర్పాటు చేస్తున్నాయి. ప్రధానంగా దేవాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులు ఉన్న ప్రదేశాలకు దూరంగా వాటిని నిర్మించాలనే నిబంధనను తుంగలోకి తొక్కి ఇష్టానుసారం నిర్మిస్తున్నారు.

వృద్ధులు, చిన్న పిల్లలు, గర్భిణులకు ఈ రేడియేషన్ చాలా ప్రమాదకరం. మానవ శరీరంలో నిత్యం అనేక కణాలు నూతంగా పుడుతుంటాయి కొన్ని మరణిస్తూ ఉంటాయి. సక్రమంగా కణ విచ్ఛిత్తి జరిగితేనే మనిషి ఆరోగ్యంగా ఉంటాడు.



గాడి తప్పుతున్న కణ విచ్ఛిత్తి

ఈ రేడియేషన్ వల్ల కణ విచ్ఛిత్తి గాడి తప్పి కణాలు ప్రవర్తించడం వల్ల క్యాన్సర్ కణుతులు ఏర్పడి మనిషి ప్రాణాలు అనంత వాయువులో కలిసిపోతున్నాయి. ఈ టవర్లు ఏర్పాటు చేసుకున్న ఇంటి యజమానులు మొబైల్ కంపెనీలు ఇచ్చే అద్దెలకు, వారు ఇచ్చే ఆఫర్లకు ఆశ పడి వాటి వల్ల వచ్చే ప్రమాదాలను ఊహించలేక పోతున్నారు. వైర్‌లెస్ టెక్నాలజీ పెరిగి మనిషి జీవితం సుఖవంతవుతుందని ఆనందంపడాలో రేడియేషన్ వల్ల వచ్చే వివిధ రకాల భయంకరమైన క్యాన్సర్ తదితర రోగాలతో బాధ పడాలో అర్థం కాని అయోమయ స్థితిలో నేటి యువతరం ఉంది. రేడియేషన్ వల్ల చర్మ సంబంధ వ్యాధులతో పాటు, కళ్లు ఎర్రబడడం, తల తిరుగుతున్నట్లు అనిపించడం, జుట్టు ఊడిపోవడం, పురుషులకు సంతాన సామర్థ్యం తగ్గిపోవడం అవుతుంది. ఇప్పుడు ప్రతి ఇంటికో సుగర్ వ్యాధి బాధితులు ఉన్నట్లయితే భవిష్యత్‌లో క్యాన్సర్ వ్యాధి బాధితులు ఉండే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

విద్యుదయస్కాంత తరంగాలతో..

సెల్‌ఫోన్ నుంచి వచ్చే విద్యుదయస్కాంత తరంగాల వల్ల గర్భిణులు, చంటి పిల్లలకు చాలా ప్రమాదం ఉంది. గర్భంలో శిశువు ఎదుగుదలకు అడ్డుగా మారి, నెలలు నిండకుండా పిల్లలు పుట్టడం తదితర పరిణామాలు ఉంటాయి. సెల్ టవర్లు ఉన్న ప్రాంతంలో ప్రజలు చాలా జాగ్రత్తలు పాటించాలి.

డాక్టర్. వై.సతీష్ కుమార్, ఫిజిక్స్ లెక్చరర్

ఇప్పల పోలమ్మకు కలెక్టర్ ప్రత్యేక పూజలు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం పట్టణ ప్రజల ఇలవేల్పు ఇప్పల పోలమ్మ జాతర సందర్భంగా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండగ నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

నేటి నుంచి ఇంటర్ కళాశాలల పునఃప్రారంభం

విజయనగరం అర్బన్: జూనియర్ కళాశాలలకు వేసవి సెలవులు ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి కళాశాలలు పునఃప్రారంభం కానున్నాయి. జిల్లాలోని ప్రభుత్వ జూ నియర్ కళాశాలలు 18, కేజీబీవీలు 26, ఆదర్శ పాఠశాలలు 16 ఉన్నాయి. ద్వితీయ సంవత్సర విద్యార్థులు కళాశాలలకు హాజరు కావాలని ఆర్ఐఓ ఎస్.తవిటినాయుడు సూచించారు.